www.prajasakti.com
ప్రజాశక్తి
శనివారం 13 మే 2023
5
ఏలూరు

13న జాతీయ లోక్‌అదాలత్

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా జడ్జి సి.పురుషోత్తంకుమార్ ఆధ్వర్యంలో ఈ నెల 13న జాతీయ లోక్‌అదాలత్ నిర్వహిస్తున్నామని మొదటి అదనపు జిల్లా జడ్జి జి.రామగోపాల్ తెలిపారు. శుక్రవారం సాయంత్రం కోర్టు ఆవరణలోని న్యాయ సేవాధికారి సంస్థ భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని అన్ని కోర్టుల్లో జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ లోక్ అదాలత్‌లో ఇప్పటివరకు 6,514 పెండింగ్ కేసులను, అలాగే 2097 ప్రీ లిటిగేషన్ కేసులను గుర్తించినట్లు చెప్పారు. లోక్‌అదాలత్‌కు సంబంధించి జిల్లాలో 31 బెంచ్‌లు ఏర్పాటు చేశామని చెప్పారు. సమావేశంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి.రాజేశ్వరి, పర్మినెంట్ లోక్‌అదాలత్ ఛైర్‌పర్సన్ ఎ.మేరీ గ్రేస్‌కుమారి, డిఎస్‌పి పైడేశ్వరరావు, ప్రభుత్వ న్యాయవాది బిజె.రెడ్డి పాల్గొన్నారు.

అధైర్య పడొద్దు.. అండగా ఉంటా..

ఇరగవరం నుంచి తణుకు వరకు చంద్రబాబు పాదయాత్ర

చంద్రబాబుకు సమస్యలు ఏకరువు పెట్టిన రైతులు

ధాన్యం రోడ్డుపై వేసి నిరసన తెలిపిన రైతులను అడ్డగించిన పోలీసులు

పోలీసుల తీరుకు నిరసనగా రోడ్డుపై బైటాయించిన మాజీ ఎంఎల్‌ఎ ఆరిమిల్లి

కరెంటు స్తంభాలకు సంచులు కట్టి అన్నదాత నిరసన

మంత్రి కారుమూరిపై మండిపడిన చంద్రబాబు

పాదయాత్రలో చంద్రబాబు, నేతలు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి, భీమవరం, తణుకు రూరల్, తణుకు

రైతులకు ధైర్యం చెబుతూ.. అండగా ఉంటామని భరోసా ఇస్తూ ఇరగవరం నుంచి తణుకు వరకు చంద్రబాబు పాదయాత్ర శుక్రవారం సాగింది. ధాన్యం కొనుగోలు సమస్యలపై చంద్రన్న రైతు పోరుబాట పేరిట చంద్రబాబు పాదయాత్రకు శ్రీకారం చుట్టారు. దీనిలో భాగంగా గురువారం సాయంత్రం ఇరగవరం చేరుకుని సెంటర్‌లో రైతులతో రచ్చబండ కార్యక్రమం నిర్వహించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గురువారం రాత్రి అక్కడే బస చేసిన చంద్రబాబు శుక్రవారం ఉదయం తొమ్మిది గంటలకు తన పాదయాత్రను ప్రారంభించారు. ముందుగా ఇరగవరంలోని శ్రీ మద్ది ఆంజనేయ ఆలయం నుంచి తన పాదయాత్ర ప్రారంభించారు. ఇరగవరం నుంచి గొటేరు, గోపాలపురం, తణుకు మీదుగా తేతలి వై.జంక్షన్ దాదాపు 12 కిలోమీటర్ల మేర చంద్రబాబు పాదయాత్ర సాగింది. మార్గమధ్యంలో పొలాల్లోని రైతుల వద్దకు వెళ్లి మొలకెత్తిన ధాన్యాన్ని పరిశీలించి రైతులతో మాట్లాడారు. పడిపోయిన వరి చేనును, రైతులు తీసుకొచ్చిన వరి కంకులను, పనల మీద ఉన్న వరి చేలను చంద్రబాబు పరిశీలించి ప్రభుత్వంపై మండిపడ్డారు. అకాల వర్షాల వల్ల పంట చేతికందకపోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఎవరూ అధైర్యపడవద్దని రైతులకు టిడిపి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ధాన్యం కొనుగోలు చేసి నష్టపరిహారం అందించాలని నేను ఇక్కడికి వస్తే వైసిపి అడుగడుగునా ఆంక్షలు సృష్టిస్తుందన్నారు. మిల్లర్లను పాదయాత్ర అనంతరం వై.జంక్షన్ సమీపంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ప్రభుత్వం చంద్రబాబు తీవ్ర విమర్శలు గుప్పించారు. రాత్రి 8.30 గంటలకు చంద్రబాబు పర్యటన ముగిసింది. రైతులకు దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం ఇవ్వాలని, వరికి, మొక్కజొన్నకు రూ.25 వేలు, వాణిజ్య పంటలకు రూ.50 వేలు ఇవ్వాలని చంద్రబాబు డిమాండ్ చేశారు. వారం రోజుల్లో సమస్యలు పరిష్కరించకపోతే తాడేపల్లికి వచ్చి పోరాటం ఉధృతం చేస్తామన్నారు. తేమ, నూక, తూకం పేరుతో మిల్లర్లు వసూలు చేసిన డబ్బును రైతులకు వెంటనే తిరిగివ్వాలన్నారు. లేకపోతే టిడిపి ప్రభుత్వం ఇచ్చిన తర్వాత రైతులకు పరిహారం చెల్లిస్తుందన్నారు. సమస్యల పరిష్కారానికి రైతులంతా రోడ్లపైకి రావాలని చంద్రబాబు పిలుపునిచ్చారు. గోటేరుకు చెందిన రైతు నట్టి రాంబాబు నాలుగు ఎకరాలు, తిప్పరాల ముత్యాలరావు 1.70 ఎకరాల్లో సాగు చేసిన పంట తడిచిపోయిందన్నారు. రైతు రామరాజు మాట్లాడుతూ ఐదెకరాల ధాన్యం తడిచి ముద్దయిందన్నారు. రైస్‌మిల్లర్ దగ్గరకు తీసుకెళ్తే బస్తాకు రెండు కేజీలు ఎక్కువ తూస్తున్నారని చెప్పారు. సంచులు ఇవ్వడం లేదని, ఇచ్చిన సంచులు చిరిగిపోయాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు అన్నివిధాలా అండగా ఉండి ఆదుకుంటామన్నారు.

రోడ్డుపై బైఠాయించిన మాజీ ఎంఎల్‌ఎ ఆరిమిల్లి

చంద్రబాబు పర్యటన నేపథ్యంలో చంద్రబాబుకు చూపించేందుకు రైతులు ధాన్యన్ని రోడ్డుపైకి తీసుకురాగా పోలీసులు అడ్డుకున్నారు. ధాన్యం ట్రాక్టర్లను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ నేపథ్యంలో రైతులతో కలిసి తణుకు మాజీ ఎంఎల్‌ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ రోడ్డుపై బైటాయించి నిరసన తెలిపారు. పోలీసులు ధాన్యం ట్రాక్టర్లను విడిచిపెట్టడంతో సమస్య సద్దుమణిగింది.

వరి చేలో నడిచిన చంద్రబాబు

రైతు సమస్యల పట్ల ప్రభుత్వం అవలంభిస్తున్న వ్యతిరేకతను నిరసిస్తూ చంద్రబాబు వరి చేలో పాదయాత్ర సాగించారు. గోపాలపురం దాటిన తర్వాత చంద్రబాబు వరి చేలో నడిచారు. ప్రభుత్వం తక్షణం రైతుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

మంత్రి కారుమూరిపై మండిపాటు

మంత్రి కారుమూరి నాగేశ్వరరావు రైతులను ఎర్రి.. అంటూ విమర్శించడమే కాకుండా దానికి బుజ్జి నాన్న అంటూ అర్థం చెప్పారన్నారు. మొదటి ఎర్రి.. తాడేపల్లిలోనూ, రెండో ఎర్రి.. తణుకులోనూ ఉన్నాడంటూ ఎద్దేవా చేశారు. రైతులను అవమానించిన మంత్రిని డిస్మిస్ చేయాలని డిమాండ్ చేశారు. సిఎంకు నీతి నిజాయితీ ఉంటే ఈ పని వెంటనే చేయాలన్నారు. చేతగాని మంత్రి అంటూ దమ్ముంటే తణుకు నియోజకవర్గంలో ధాన్యం కొనాలన్నారు. నేను వస్తే ఫ్లెక్సీలు కడతావా.. నీ ఇంట్లో పెళ్లా, తద్దినమా అంటూ విమర్శించారు. మంత్రి తలుచుకుంటే నేను తణుకు దాటలేరని చెబుతున్నారని, అమ్మో నాకు భయమేస్తోంది.. నిద్ర రావడం లేదంటూ ఎగతాళిగా మాట్లాడారు. 45 ఏళ్లు రాజకీయాల్లో ఉన్నానని, ముఠా రాజకీయాలను అణిచివేసిన పార్టీ టిడిపి అని అన్నారు. వైసిపి నాయకులు రౌడీయిజం చేస్తే ఎట్టి పరిస్థితుల్లోనూ వదలబోమన్నారు. బాంబులకే భయపడలేదని, తాటాకు చప్పుళ్లకు కుందేళ్లు బెదురుతాయా అని అన్నారు. నోరు పారేసుకోవద్దు. అంటూ మంత్రి కారుమూరిని హెచ్చరించారు. కౌలు రైతులను అన్నివిధాలా ఆదుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు రైతుల సమస్యలపై మాట్లాడారు. మాజీ మంత్రులు పితాని సత్యనారాయణ, పీతల సుజాత, పత్తిపాటి పుల్లారావు, జవహర్, దేవినేని ఉమా, జిల్లా అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మి, ఎంఎల్‌ఎలు నిమ్మల రామానాయుడు, మంతెన రామరాజు, మాజీ ఎంఎల్‌ఎ గన్ని వీరాంజనేయులు, తూర్పుగోదావరి జిల్లా నాయకులు, జిల్లా ఇన్‌ఛార్జులు పాల్గొన్నారు.

గోడు వెళ్లబోసుకున్న రైతులు

చంద్రబాబు పాదయాత్రలో రైతులు సమస్యల గోడు వినిపించారు. ఇరగవరానికి చెందిన రైతు కోడెల మోహన్‌రావుకు చెందిన రెండెకరాల వరిపొలాన్ని చంద్రబాబు పరిశీలించిన సందర్భంలో మోహన్‌రావు అనేక సమస్యలు విన్నవించారు. అకాల వర్షానికి పంట మొత్తం నేలమట్టమైందని ఆవేదన వ్యక్తం చేశారు. గణేష్‌రావు, ముత్యాల నాగేశ్వరరావు చెందిన ఎనిమిదెకరాల ధాన్యాన్ని చంద్రబాబు పరిశీలించారు. ధాన్యం మొత్తం తడిచిపోయిందని, మొలకలు వచ్చాయని కొనుగోలుకు ఎవరూ ముందుకు రావట్లేదని చంద్రబాబు దృష్టికి తీసుకొచ్చారు. అర్జునుడుపాలెంకు చెందిన రైతు పి.శ్రీనివాస్ నాలగెకరాల్లో వ్యవసాయం చేశానని మొలకలు వచ్చిన ధాన్యాన్ని చంద్రబాబుకు చూపించారు. గొటేరుకు చెందిన ఇందుకూరి రామరాజు మాట్లాడుతూ ఐదెకరాల ధాన్యం మొత్తం తడిచి ముద్దయ్యిందన్నారు. ఇచ్చిన సంచులు కూడా చిరిగిపోయాయన్నారు.

బైఠాయించిన ఆరిమిల్లితో మాట్లాడుతున్న పోలీసు అధికారి

మొలకలొచ్చిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న చంద్రబాబు

వరిచేలో చంద్రబాబు

రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్‌ను సత్కరిస్తున్న వైస్ ఛాన్సలర్ జానకిరామ్

ఉద్యాన ఉత్పత్తుల్లో ఏపిది రెండో స్థానం

ఉద్యాన యూనివర్సిటీ ఐదో స్నాతకోత్సవంలో రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

వ్యవసాయం, ఉద్యాన రంగాల ఉత్పత్తిలో మన రాష్ట్రం రెండో స్థానంలో ఉందని రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ అన్నారు. శుక్రవారం వెంకట్రామన్నగూడెంలోని డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం 5వ స్నాతకోత్సవ కార్యక్రమానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. ఆర్థిక సూపర్ పవర్‌గా భారతదేశం ఎదుగుతోందన్నారు. ప్రపంచవ్యాప్తంగా విస్తరిస్తున్న జనాభా రీత్యా భవిష్యత్‌లో పోషకాహార భద్రత మరింత ఎక్కువ ప్రాముఖ్యతను సంతరించుకోనుందన్నారు. ఉద్యానవన ఉత్పత్తి ఇప్పటికే దేశంలోని వ్యవసాయోత్పత్తిని అధిగమించిందని, ఇది స్థూల జాతీయోత్పత్తిలో ఆరు శాతంగా ఉండటం శుభపరిణామమన్నారు. ఉద్యాన రంగం 14 శాతం ఉపాధి అవకాశాలను సృష్టిస్తోందని, అందులో 12 శాతం మహిళలకే కావడం గొప్ప విషయమని అన్నారు. కొన్ని దశాబ్దాలుగా ఆంధ్రప్రదేశ్‌లో అద్భుతమైన ఉద్యానవన వృద్ధిని సాధించామని, ఉద్యానవనాన్ని రాష్ట్రంలో సూర్యోదయ రంగంగా గుర్తించామని, 17.84 లక్షల హెక్టార్ల విస్తీర్ణంలో 312.34 లక్షల మెట్రిక్ టన్నుల ఉత్పత్తితో దేశంలోనే రెండో స్థానంలో ఉందని ఆయన స్పష్టం చేశారు. ఉద్యానవన ఉత్పత్తిలో ఇన్‌పుట్ వినియోగ సామర్థ్యాన్ని పెంచడానికి రోబోటెక్ టెక్నాలజీలు, డ్రోన్ల రూపకల్పన, ఉపయోగం వంటి సరిహద్దు సాంకేతికతలతో విశ్వవిద్యాలయం కూడా ముందుకు సాగడం హర్షణీయమన్నారు. ప్రతిభ కనబరిచిన శాస్త్రవేత్తలు, ప్రొఫెసర్లు, విద్యార్థులకు అవార్డులు, బంగారు పతకాలను అందించారు. స్నాతకోత్సవంలో డిగ్రీలు పొందిన విద్యార్థులందరినీ గవర్నర్ అభినందించారు. ఉద్యాన రంగాన్ని కెరీర్‌గా ఎంచుకున్నందుకు వారిని ప్రత్యేకంగా ప్రశంసించారు. ముఖ్యఅతిథి నీతి ఆయోగ్ సభ్యుడు, ప్రఖ్యాత వ్యవసాయ ఆర్థికవేత్త ప్రొఫెసర్ డాక్టర్ రమేష్‌చంద్ తొలుత స్నాతకోపన్యాసం చేశారు. ఉద్యానవన విద్యలో ఉత్తమ ఫలితాలు పొంది డిగ్రీలు సాధించిన విద్యార్థులు జాతీయ స్థాయిలో రైతులకు ఉపయోగపడే నూతన ఆవిష్కరణలు చేయాలని సూచించారు. ప్రభుత్వాలు అందిస్తున్న విద్యా వనరులను సద్వినియోగం చేసుకుని ఉన్నత విద్యావకాశాలు సాధించాలన్నారు. అన్ని రకాల వాతావరణాలను తట్టుకునే విధంగా రైతులకు ఉపయోగపడే మేలైన వ్యవసాయ, ఉద్యాన వంగడాలను సృష్టించేందుకు నిరంతరం కృషి చేయాలని పిలుపునిచ్చారు. నూతన విత్తనాలతోపాటు నాణ్యమైన ఉత్పత్తులు పొందేందుకు అవసరమైన సేంద్రియ ఎరువులను వాడేలా రైతులను ప్రోత్సహించాలన్నారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభాలు పొందేలా రైతులకు అవసరమైన సూచనలు, సలహాలు అందించాలన్నారు. మారుతున్న వాతావరణాన్ని దృష్టిలో ఉంచుకుని రైతులు ఆర్థికంగా నష్టపోకుండా ఉండేందుకు ఉద్యాన పంటలు వేసుకునేలా ప్రోత్సహించాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయ, ఉద్యాన పంటల అభివృద్ధికి రైతులకు కావల్సిన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిస్తుందని తెలిపారు. అధిక దిగుబడుల పేరుతో క్రిమిసంహారక మందులు వాడటం వల్ల వాతావరణంలో పెనుమార్పులు కలుగుతున్నాయన్నారు. డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ డాక్టర్ తోలేటి జానకిరామ్ గవర్నర్‌కు మెమెంటోను అందజేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ బి.శ్రీనివాసులు, యూనివర్సిటీ బోర్డు మెంబర్లు, విశ్వవిద్యాలయం ప్రొఫెసర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

హమాలీల బిల్లులు సకాలంలో విడుదల చేయాలి

హమాలీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.ఉదయభాస్కర్‌రావు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

జిల్లాలో సివిల్ సప్లయిస్ హమాలీలకు బిల్లులు సకాలంలో విడుదల చేయాలని హమాలీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.ఉదయభాస్కర్‌రావు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక అల్లూరు సత్యనారాయణ భవనంలో యూనియన్ జిల్లా సమావేశం గడ్డి సూర్యారావు అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథి ఉదయభాస్కర్‌రావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రేషన్ సరుకులను వారం రోజుల్లో ఎగుమతి, దిగుమతి చేయాలని ఒత్తిడి తెస్తోందని, గతంలో మొదటి వారంలోనే బిల్లులు చేసేవారని, నేడు అవి రెండో వారం దాటినా బిల్లులు రావడం లేదని అన్నారు. నెలంతా కష్టపడి పని చేస్తే సకాలంలో బిల్లులు ఇవ్వకుంటే కార్మికుల కుటుంబాలు ఎలా పోషించుకోవాలని ఆయన ప్రశ్నించారు. ఇఎస్‌ఐ సమస్య దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉందని, రాష్ట్ర ప్రభుత్వం కోర్టులో జోక్యం చేసుకుని తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. డీలర్లకు సరుకు సరఫరా ఆర్డర్‌లు ప్రతినెలా 20వ తేదీకల్లా ఇవ్వాలని, పని ఒత్తిడి తగ్గించాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో సిఐటియు సీనియర్ నాయకులు చింతకాయల బాబూరావు, జిల్లా అధ్యక్షుడు ఆర్.లింగరాజు మాట్లాడుతూ హమాలీలను సంస్థ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సంఘం ఏలూరు జిల్లా గౌరవాధ్యక్షులుగా ఆర్.లింగరాజు, జిల్లా అధ్యక్షునిగా కె.శేఖర్, జిల్లా కార్యదర్శిగా గడ్డి సూర్యారావు, ఉపాధ్యక్షులుగా తిరుపతయ్య, అబ్బులు, సహాయ కార్యదర్శిగా కొర్స కిషోర్, కోశాధికారిగా ఎస్.రాంబాబు ఎన్నికయ్యారు. అనంతరం సివిల్ సప్లయిస్ డిఎంకు వినతిపత్రం సమర్పించారు.

జిఒ నెం.1 రద్దుపై సిపిఎం హర్షం

ప్రజాశక్తి - ఏలూరు

రాష్ట్ర ప్రభుత్వం ప్రజా ఉద్యమాలపై ఉక్కుపాదం మోపేందుకు తీసుకొచ్చిన జిఒ నెం.1పై ఎపి హైకోర్టు ఇచ్చిన తీర్పు పట్ల సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. హైకోర్టు తీర్పుతో ప్రజాఉద్యమాలకు విజయం చేకూరినట్లేనని అభివర్ణించారు. హైకోర్టు తీర్పుతో ఇప్పటికైనా ముఖ్యమంత్రి మార్చుకోవాలని సూచించారు.

తడిచిన మొక్కజొన్నను వెంటనే కొనుగోలు చేయాలి

ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్

జంగారెడ్డిగూడెం: తడిచిన మొక్కజొన్నను ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. శుక్రవారం జంగారెడ్డిగూడెం మండలంలోని అకాల వర్షాలకు తడిచిన మొక్కజొన్న పంటను పరిశీలించారు. మొక్కజొన్న రైతులను ఆదుకోవాలంటూ నినదిస్తూ మొక్కజొన్న కల్లాల వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కె.శ్రీనివాస్ మాట్లాడుతూ అకాల వర్షాలకు మొక్కజొన్న పంట తడిచిపోయి రైతులు నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. మద్దతు ధర కంటే రూ.200 నుండి రూ.300 వరకు వ్యాపారులు తక్కువ కొనుగోలు చేయడం, ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తానని చెప్పడంతో రైతులు వాటికోసం ఎదురు చూశారని చెప్పారు. ఈలోపు అకాల వర్షాలు రావడంతో పంట తడిచిపోయిందన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే మొక్కజొన్న రైతులు నష్టపోయారని విమర్శించారు. కొనుగోలు కేంద్రాలు తెరుస్తున్నామని అధికారులు ప్రకటించినా రైతుల వద్దనున్న పంట పూర్తిగా కొనుగోలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు ఇవ్వలేదన్నారు. జిల్లాలో లక్ష 80 వేల మెట్రిక్ టన్నుల మొక్కజొన్న ఉత్పత్తి జరిగితే కేవలం రైతుల నుండి పదివేల మెట్రిక్ టన్నుల మాత్రమే కొనుగోలు చేయాలని ఆదేశాలివ్వడం అన్యాయమన్నారు. పంటను పూర్తిగా కొనుగోలు చేయాలని, తడిచిన మొక్కజొన్నను మద్దతు ధరకే కొనుగోలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం జిల్లా సహాయ కార్యదర్శి బొడ్డు రాంబాబు, మొక్కజొన్న రైతులు గోలి నరసింహారెడ్డి, మాండ్రు సూర్యచంద్రం, పలువురు రైతులు పాల్గొన్నారు.

మొక్కజొన్నను పరిశీలిస్తున్న నేతలు

ఉపాధి హామీని పటిష్టంగా అమలు చేయాలి

నేషనల్ మొబైల్ మానిటరింగ్ ఫొటోస్ సిస్టమ్‌ను రద్దు చేయాలి

కలెక్టరేట్ వద్ద ఉపాధి కూలీల ధర్నాలో ఎపి వ్యకాస జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ

ప్రజాశక్తి - ఏలూరు

కోట్లాది గ్రామీణ పేదలకు పట్టెడన్నం పెట్టడానికి వచ్చిన ఉపాధి హామీ చట్టం నేడు ప్రమాదంలో పడిందని, ఈ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ అన్నారు. ఉపాధి హామీ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని కోరుతూ ఉపాధి కూలీలు ఎపి వ్యకాస ఆధ్వర్యాన శుక్రవారం స్థానిక కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం ఈ చట్టాన్ని నిర్వీర్యం చేయడం కోసం ఉపాధి హామీలో నేషనల్ మొబైల్ మానిటరింగ్ ఫొటో సిస్టమ్, రెండు పూటలా పనిని తీసుకొచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనివల్ల ఉపాధి కూలీలకు తీవ్ర నష్టం కలుగుతుందని మండిపడ్డారు. ఈ చట్టాన్ని నిర్వీర్యం చేయడం కోసం బిజెపి చేసిన అనేక కుట్రల్లో భాగంగా కూలీలకు వేతనాలు, సమ్మర్ అలవెన్స్, మేట్ల పారితోషకం, ఫీల్డ్ అసిస్టెంట్లపై రాజకీయ వేధింపులకు పాల్పడుతుందన్నారు. కోట్లాది మందికి సొంత గ్రామాల్లో ఉపాధి చూపి కొద్దోగొప్పో పేదల కొనుగోలు శక్తిని ఉపాధి హామీ పెంచిందన్నారు. 2020లో కరోనా సమయంలో పేదల ఆకలిచావులు సంభవించకుండా కాపాడిందన్నారు. ఇంతటి ప్రాధాన్యత కలిగినటువంటి ఉపాధి హామీ చట్టాన్ని మరింత ముందుకు తీసుకువెళ్లడానికి నిధులు పెంచి బలోపేతం చేయాల్సిన బాధ్యత కేంద్ర బిజెపి ప్రభుత్వానిదన్నారు. అనంతరం సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు మాట్లాడుతూ ఈ ఆర్థిక సంవత్సరంలో కేంద్ర బడ్జెట్‌లో బిజెపి రూ.30 వేల కోట్లు నిధులు తగ్గించి ఉపాధిహామీ పీక నొక్కిందన్నారు. అంటే ఏడాదికి కుటుంబానికి 22 పనిదినాలకు మాత్రమే నరిపోతుందన్నారు. దీన్నిబట్టి బిజెపి పేదల పట్ల ఎలాంటి వైఖరితో ఉందో అర్థమవుతుందన్నారు. బిజెపి విధానాలకు రాష్ట్ర ప్రభుత్వం వత్తాసు పలుకుతుందని మండిపడ్డారు. సమ్మర్ అలవెన్సు, పేస్లిక్, ఇతర సౌకర్యాలు కల్పించాలని కోరారు. పని ప్రదేశాల్లో ఆశా, ఎఎన్‌ఎంలను నియమించాలన్నారు. కుటుంబానికి 200 పనిదినాలు, రూ.600 వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉపాధిలో యంత్రాలు, కాంట్రాక్టర్లను నిషేధించాలని, అవినీతికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సైట్ సూపర్‌వైజర్లకు పారితోషికం ఒక్కో కూలీకి రూ.5 ఇవ్వాలని కోరారు. పట్టణ ప్రాంతాల్లో ఉపాధిహామీ పనులు విస్తరించడానికి ప్రత్యేక నిధులు కేటాయించాలని, ఫీల్డు అసిస్టెంట్లపై రాజకీయ వేధింపులు ఆపాలని కోరారు. ఈ కార్యక్రమంలో నేతలు ఎస్.మహంకాళి, టి.సత్యనారాయణ, డి.దాసు, నాగేంద్ర, మణి, సిహెచ్.మాధవ, సత్యనారాయణ, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ధర్నాలో నినదిస్తున్న నేతలు, ఉపాధి కూలీలు

కొల్లేరు సమస్యలు పరిష్కరించండి

ఎంఎల్‌సి జయమంగళ

ప్రజాశక్తి - కైకలూరు

కొల్లేరు సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని శాసనమండలి సభ్యులు జయమంగళ వెంకటరమణ కోరారు. శుక్రవారం ఆయన తాడేపల్లిలోని సిఎం క్యాంపు కార్యాలయంలో వైసిపి రీజనల్ కోఆర్డినేటర్, ఎంపీ మిధున్‌రెడ్డికి కొల్లేరు సమస్యలను వివరించారు. కైకలూరు నియోజకవర్గంలో రైతులు, కొల్లేరు ప్రాంతంలో ప్రజలు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లాలని ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్ సమక్షంలో వినతిపత్రం అందజేశారు. రైతులు వారి స్వాధీనం, అనుభవంలో ఉన్న భూములకు హక్కు కల్పించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు నిబంధనకు లోబడి కొల్లేరు ప్రాంత గ్రామాల్లో మంచినీటి చెరువులు, పశువులు తాగేందుకు చెరువులు ఏర్పాటు చేసుకోవడానికి అవకాశం కల్పించాలన్నారు. సుప్రీంకోర్టు నిబంధనలకు లోబడి వచ్చే వర్షాకాలంలోపు గ్రామాల్లో స్వాధీనం చేసుకోవాల్సిన భూమి కంటే ఎక్కువ భూమిని స్వాధీనం చేసుకున్న భూములకు పట్టాలు ఇవ్వాలన్నారు. వచ్చే వారంలో ఫారెస్ట్ అధికారులతో సమావేశం ఏర్పాటు చేయాలని కోరారు.

బిజెపి ఎంపీ పదవిని రద్దు చేయాలని నిరసన

ఏలూరు: మహిళా రెజ్లర్లపై బిజెపి ఎంపీ లైంగిక వేధింపులకు పాల్పడి దర్జాగా తిరుగుతున్నాడని, దేశానికి పతకాలు తెచ్చిన మహిళా యోధులు నడిరోడ్డుపై న్యాయం కోసం పోరాడుతున్నారని సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే బిజెపి ఎంపీ బ్రిజ్‌భూషణ్‌ను అరెస్ట్ చేసి, అతని ఎంపీ పదవిని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఢిల్లీలో మహిళ రెజ్లర్ల న్యాయ పోరాటానికి మద్దతుగా సిఐటియు ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక కొత్త బస్టాండ్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. తొలుత సిఐటియు కార్యాలయం నుండి ప్రదర్శనగా బస్టాండ్ వద్దకు చేరుకుని నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా శ్రామిక మహిళ జిల్లా కన్వీనర్ కొర్రి విజయలక్ష్మి మాట్లాడుతూ బిజెపి వచ్చాక దేశంలో మహిళలపై అత్యాచారాలు, దాడులు పెరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు. మహిళా యోధులకు దేశ ప్రజలందరూ మద్దతుగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సిఐటియు నగర అధ్యక్ష కార్యదర్శులు బి.జగన్నాథం, వి.సాయిబాబు, నేతలు కోటేశ్వరరావు, శేఖర్, గడ్డి సూర్యారావు తదితరులు పాల్గొన్నారు.

నినదిస్తున్న నేతలు

ఎపిఎంపై చర్యలు తీసుకోవాలి : సిపిఎం

ప్రజాశక్తి - కుక్కునూరు

సిఐటియు మండల కార్యదర్శి యర్నం సాయికిరణ్‌పై దుర్భసలాడుతూ చంపుతానని బెదిరించిన కుక్కునూరు ఎపిఎం బళ్లారి శ్రీనివాసరావుపై చర్యలు తీసుకోవాలని సిపిఎం మండల కార్యదర్శి యర్రంశెట్టి నాగేంద్రరావు డిమాండ్ చేశారు. సుందరయ్య భవనం ప్రజాసంఘాల కార్యాలయంలో సిపిఎం ముఖ్య కార్యకర్తల సమావేశం కోట రామలక్ష్మి అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగేంద్రరావు మాట్లాడుతూ మండలంలో డ్వాక్రా మహిళ గ్రూపుల వద్ద ఆసరా డబ్బులు బ్యాంకు నుంచి తీసుకునేందుకు వెలుగు అధికారుల సంతకం కోసం డ్వాక్రా మహిళలు వెళ్తే రూ.500 ఇస్తేనే సంతకం పెడతానని ఎపిఎం బళ్లారి శ్రీనివాసరావు గ్రూపు సభ్యులపై ఒత్తిడి తీసుకురావడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఈ విషయంపై అడిగిన సిఐటియు మండల కార్యదర్శి యర్నం సాయికిరణ్‌పై దుర్భసలాడుతూ చంపుతానని బెదిరింపులకు పాల్పడటం దుర్మార్గమన్నారు. బెదిరింపులకు పాల్పడిన ఎపిఎంపై ఉన్నతాధికారులు స్పందించి వెంటనే చర్యలు తీసుకోవాలని, లేకపోతే సిపిఎం ఆధ్వర్యంలో కార్మికులతో కలిసి చర్యలు తీసుకునేంత వరకు ఆందోళనలు చేపడతామని తెలిపారు. ఈ సమావేశంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు శ్రీను, యర్నం సాయికిరణ్, షేక్ వలిపాషా, పట్ల లక్ష్మయ్య, కోట మోహన్‌రావు పాల్గొన్నారు.

నేడు రౌండ్‌టేబుల్ సమావేశం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఉద్యోగుల న్యాయమైన డిమాండ్స్ పరిష్కారానికి ఎపిజెఎసి అమరావతి మూడో దశ ఉద్యమ కార్యాచరణలో భాగంగా ఈ నెల 13వ తేదీన రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్లు ఎపి జెఎసి అమరావతి జిల్లా ఛైర్మన్ కె.రమేష్‌కుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఏలూరు రెవెన్యూ భవనంలో వివిధ ఉద్యోగ సంఘాలు, సిఐటియు, ఎఐటియుసిలతో శనివారం ఉదయం 11 గంటలకు ఈ సమావేశం, మధ్యాహ్నం ఒంటి గంటకు ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాతో పాత్రికేయ సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు.

గుండుగొలను కో-ఆపరేటివ్ సొసైటీ ఛైర్మన్‌గా భాస్కర్

ప్రజాశక్తి - భీమడోలు



బాధ్యతలు స్వీకరిస్తున్న వివివి.భాస్కర్

హైకోర్టు ఆదేశాల మేరకు గుండుగొలను కోఆపరేటివ్ సొసైటీ ఛైర్మన్‌గా వివివి.భాస్కర్ శుక్రవారం బాధ్యతలను స్వీకరించారు. సొసైటీ ఇన్‌ఛార్జి సెక్రటరీ, డిసిసిబి భీమడోలు బ్రాంచ్ సూపర్‌వైజర్ వి.సతీష్‌కుమార్ బాధ్యతలను వివివి. భాస్కర్‌కు అప్పగించారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు విరాళం

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

ద్వారకాతిరుమల వెంకటేశ్వరస్వామి ఆలయంలో శాశ్వత నిత్యాన్నదాన ట్రస్టుకు పశ్చిమగోదావరి జిల్లా తణుకు సజ్జాపురం గ్రామానికి చెందిన బాపతు మదనగోపాలరెడ్డి శుక్రవారం రూ.1,11,111 విరాళం ఆలయ సహాయ కార్యనిర్వహణాధికారి పి.నటరాజారావుకు బ్యాంక్ చెక్ ద్వారా అందించారు. అనంతరం దాత కుటుంబ సభ్యులు స్వామిఅమ్మవార్లను దర్శించుకున్నారు.

విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన

ప్రజాశక్తి - చాట్రాయి

చనుబండ శాఖా గ్రంథాలయంలో శుక్రవారం వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా విద్యార్థులకు ఉపాధ్యాయురాలు బి.రత్నకుమారి గణిత శాస్త్రంలో సంకలనం, వ్యవకలనం, భాగాహారం గురించి వివరించారు. 35 మంది విద్యార్థులతో కథల పుస్తకాలు చదివిస్తున్నారు. చాట్రాయి గ్రంథాలయంలో విద్యార్థులకు నీతి కథలు చెప్పారు. ఈ కార్యక్రమాన్ని చనుబండ గ్రంథాలయ లైబ్రేరియన్ కె.శ్రీకాంత్, చాట్రాయి గ్రంథాలయ శాఖ లైబ్రేరియన్ బి.మణికంఠ నిర్వహించారు.

ప్రజలకు అందని పథకాల ప్రయోజనాలు : టిడిపి

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

ప్రభుత్వ పథకాలు అమలుపై ప్రకటనలు వాస్తవాలకు విరుద్ధంగా ఉన్నాయని టిడిపి నూజివీడు నియోజకవర్గ ఇన్‌ఛార్జి మాజీ ఎంఎల్‌ఎ వెంకటేశ్వరరావు శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆరోగ్యశ్రీ, విద్యాదీవెన, వసతి దీవెన ఏ పథకాన్ని తీసుకున్నా రూ.కోట్లు ఖర్చు పెట్టామని ప్రభుత్వం చెబుతున్నా ప్రయోజనాలు ప్రజలకు ఎందుకు అందడం లేదని ప్రశ్నించారు.

'ప్రతి ధాన్యం గింజనూ కొంటాం'

ప్రజాశక్తి - పోలవరం

ప్రతి ధాన్యం గింజను కొనుగోలు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని, రైతులు నిరాశ చెందవద్దని ఎంఎల్‌ఎ తెల్లం బాలరాజు చెప్పారు. మండలంలోని గూటాల పంపింగ్ స్కీమ్ వద్ద రైతులు కల్లాల్లో ఆరబెట్టిన ధాన్యాన్ని ఎంఎల్‌ఎ తెల్లం బాలరాజు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడుతూ సిఎం జగన్ రైతు పక్షపాతి అని చెప్పారు. తడిచిన ధాన్యాన్ని కూడా కొనుగోలు కేంద్రాల ద్వారా మద్దతు ధర ఇచ్చి కొనుగోలు చేయమని ఆదేశాలు ఇచ్చారని చెప్పారు.

నేరాలు - ఘోరాలు

ట్రాక్టర్, కారు ఢీకొని పలువురికి గాయాలు

ప్రజాశక్తి - ఉంగుటూరు

216వ జాతీయ రహదారి ఉంగుటూరు మండలం కైకరం వద్ద శుక్రవారం తెల్లవారుజామున పెళ్లి కారు, ట్రాక్టర్ ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో పలువురు గాయాలపాలయ్యారు. హైవే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... పాలకొల్లు నుంచి ఒక కుటుంబం వివాహానికి విజయవాడ వెళ్లారు. అక్కడి నుంచి కారులో తిరిగి పాలకొల్లు బయలుదేరారు. కైకరం వద్దకు వచ్చేసరికి మందలపర్రు నుంచి కైకరం గడ్డి కోసం వెళ్తున్న ట్రాక్టర్, కారు ఎదురెదురుగా ఢీకొన్నాయి. కారులో డ్రైవర్‌తో సహా ఏడుగురు ప్రయాణిస్తున్నారు. ఈ ప్రమాదంలో కారులో నలుగురికి స్వల్ప గాయాలయ్యాయి. హైవే పోలీసులు, రోడ్ సేఫ్టి సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రులను హైవే అంబులెన్స్‌లో ప్రథమ చికిత్స చేసి తాడేపల్లిగూడెం ఆసుపత్రికి తరలించారు. ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా కారును, ట్రాక్టర్‌ను హైవే క్రేన్ సాయంతో పక్కకు జరిపారు.

కారులో మంటలు

ప్రయాణికులు క్షేమం

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

ప్రయాణిస్తున్న కారులో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. కారులోని ప్రయాణికులు క్షేమంగా బయటపడడంతో అందరూ ఊపిరీ పీల్చుకున్నారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... ఏలూరుకు చెందిన కుటుంబసభ్యులు వ్యక్తిగత పనుల నిమిత్తం కారులో శుక్రవారం ఉదయం గొల్లపల్లి వచ్చారు. పని ముగించుకుని తిరిగి కారులో ఏలూరుకు బయలుదేరారు. ఈ క్రమంలో గొల్లపల్లి శివారులోకి వచ్చేసరికి సాంకేతిక లోపం వల్ల కారులో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దీంతో కారు నడుపుతున్న వ్యక్తితో పాటు కుటుంబసభ్యులు నలుగురు బయటకు దిగిపోయారు. విషయం తెలుసుకున్న ఫైర్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు.

రోడ్డు ప్రమాదంలో దంపతులకు గాయాలు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

నడుచుకుంటు వెళ్తున్న దంపతలును లారీ ఢీ కొట్టడంతో వారు తీవ్ర గాయాలపాలయ్యారు. ఈ ఘటన మండలంలోని దర్భగుడెం దాబా సమీపంలో జాతీయ రహదారిపై శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... దర్భగూడెం గ్రామానికి చెందిన రెగళ్ల నాగేశ్వరావు అతని వెంకటలక్ష్మి పొలంలో పని చేసుకొని నడుచుకుంటూ ఇంటికి బయలుదేరారు. ఈ క్రమంలో వెనుక నుంచి వచ్చిన లారీ వారిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో దంపతులు తీవ్ర గాయాలపాలయ్యారు. స్థానికులు వారిని 108లో జంగారెడ్డిగూడెంలోని ప్రయివేట్ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 83339 88814

జాతీయ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం

బైక్‌ను ఢీకొట్టిన కారు
రిటైర్డ్ వెటర్నరీ అసిస్టెంట్ మృతి
కారు ఎంపీ భరత్‌రామ్‌దిగా ప్రచారం

నరసయ్య (ఫైల్)

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

16వ నెంబరు జాతీయ రహదారిపై శుక్రవారం ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. జాతీయ రహదారిని దాటుతున్న సమయంలో ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొన్న ప్రమాదంలో భీమడోలుకు చెందిన రిటైర్డ్ వెటర్నరీ అసిస్టెంట్ శృంగవృక్షం నరసయ్య (65) అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీరామవరానికి చెందిన నరసయ్య కొన్నేళ్ల నుంచి భీమడోలులో ఉంటున్నారు. ఆయనకు ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఇరువురికి వివాహాలు అయ్యాయి. నరసయ్య వ్యక్తిగత పనుల నిమిత్తం శుక్రవారం ఉదయం భీమడోలు నుంచి బైక్‌పై సీతంపేట బయలుదేరారు. ఈ క్రమంలో దెందులూరు మండలంలోని కొత్తగూడెం రహదారి వద్ద రోడ్డు దాటుతుండగా విజయవాడ వైపు నుంచి రాజమండ్రి వైపుగా వెళ్తున్న కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నరసయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. ఆయన మృతితో భీమడోలు, శ్రీరామవరం గ్రామాల్లో విషాదచాయలు అలుముకున్నాయి.

కారు ఎంపీ భరత్‌రామ్‌దిగా ప్రచారం

ప్రమాదానికి కారణమైన కారు

ప్రమాదానికి కారణమైన కారు రాజమండ్రి ఎంపీ భరత్‌రామ్‌దిగా ప్రచారం సాగుతోంది. ప్రమాదం జరిగిన సమయంలో ఆయన కారులోనే ఉన్నారని కొందరు, వెనుక కారులో ఉన్నారని కొందరు, అసలు ఆయన కారు కాదని ఆయన బంధువులదనే ప్రచారం సాగుతోంది. అయితే పోలీసులు మాత్రం దీనిని నిర్ధారించలేదు. ప్రమాదం జరిగిందని సమాచారం తెలుసుకున్న దెందులూరు ఎస్ఐ వీర్రాజు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ప్రమాదం జరిగిన వెంటనే కారును డ్రైవర్‌కు అప్పగించి కారులోని వ్యక్తులు వేరే కారులో వెళ్లిపోయారు. పోలీసులు ప్రమాదానికి కారణమైన కారును స్వాధీనం చేసుకుని, డ్రైవర్‌ని అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ప్రజలకు ఇబ్బందుల్లేకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు

గాలి, వాన బాధిత గ్రామాల్లో ఎంఎల్‌ఎ వాసుబాబు పర్యటన

గ్రామాలను పరిశీలిస్తున్న ఎంఎల్‌ఎ వాసుబాబు

ప్రజాశక్తి - భీమడోలు

మండలంలో గురువారం సాయంత్రం చోటుచేసుకున్న గాలి, వాన వల్ల నష్టపోయిన గ్రామాల్లో ఉంగుటూరు ఎంఎల్‌ఎ పుప్పాల వాసుబాబు శుక్రవారం సాయంత్రం పర్యటించారు. పూళ్ల, దుద్దేపూడి, కోడూరుపాడు గ్రామాల్లో పర్యటించిన ఆయన వెంట స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, వైసిపి ప్రముఖులు ఉన్నారు. ఈ సందర్భంగా ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా చూసేందుకు పూళ్ల పంచాయతీ పాలకవర్గం రక్షిత మంచినీటి ట్యాంకుల వద్ద ఏర్పాటుచేసిన జనరేటర్‌లను పరిశీలించారు. ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరాను తిలకించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ ప్రజల ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. వాటి పరిష్కారానికి అధికారులకు తగు సూచనలు చేశారు. ట్రాన్స్‌కో భీమడోలు భీమడోలు ఎడిఎ గోపాలకృష్ణను విద్యుత్ సరఫరా పునరుద్ధరించేందుకు యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టి త్వరితగతిన పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. నష్ట నివారణ చర్యలు చేపట్టేందుకు అవసరమైన నిధులు సమకూర్చేందుకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో భీమడోలు ఎంపిపి కె.రామయ్య, సర్పంచి దాయం సుజాత, భీమడోలు సొసైటీ అధ్యక్షుడు రాయపాటి సత్యశ్రీనివాస్ పాల్గొన్నారు.

తహశీల్దార్ పర్యటన

మండల పరిధిలో గురువారం సాయంత్రం వీచిన ఈదురు గాలులకు నష్టపోయిన పూళ్ల, కురెళ్లగూడెం, దుద్దేపూడి, కోడూరుపాడు గ్రామాల్లో తహశీల్దార్ షంషుద్దీన్ ఆధ్వర్యంలోని అధికారుల బృందం శుక్రవారం పర్యటించింది. జరిగిన నష్టాలను అంచనా వేశారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూసేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసేందుకు స్థానిక యంత్రాంగానికి ఆదేశాలు జారీ చేశారు. ట్రాన్స్ కో భీమడోలు ఎడిఎ గోపాలకృష్ణ ఆధ్వర్యంలో విద్యుత్ అధికారులు, సిబ్బంది విద్యుత్ లైన్ల పునరుద్ధరణ పనులను యుద్ధ ప్రాతిపదికన చేపట్టారు. విద్యుత్ సరఫరా నిలిచిపోయిన దుద్దేపూడి, కోడూరుపాడు, పూళ్ల గ్రామాల్లో ఉన్న నాలుగు రక్షిత మంచినీటి పథకాల వద్ద తాగునీటి సరఫరా కోసం ప్రత్యేక జనరేటర్లను ఏర్పాటు చేశారు. పూళ్ల గ్రామపంచాయతీ కార్యదర్శి సూర్యకుమార్, సర్పంచి దాయం సుజాతప్రసాద్ ఆధ్వర్యంలో పూళ్ల–ఎం.ఎం.పురం రహదారిపై ఉన్న అడ్డంకులను తొలగించి, రాకపోకలకు ఇబ్బంది లేని విధంగా సిద్ధం చేశారు. ఈదురుగాలుల వల్ల నాగేశ్వరపురంలో నష్టం వాటిల్లిన ఐదు గృహాలకు ప్రభుత్వ పరంగా సహాయం అందించేందుకు భీమడోలు ఎంపిడిఓ డి.సత్యనారాయణ హామీ ఇచ్చారు. ఇదేవిధంగా ఈదురు గాలులకు నేల వాలిన 70 విద్యుత్ స్తంభాల స్థానంలో నూతన స్తంభాల ఏర్పాటు, కండక్టర్లు ఏర్పాటు చేయడం, ట్రాన్స్‌ఫారంలను బాగు చేయటం వంటి కార్యక్రమాలను ట్రాన్స్ కో ఎడిఇ గోపాలకృష్ణ ఆధ్వర్యంలో చేపట్టారు. ప్రస్తుతం కురెళ్లగూడెంలో తమ శాఖ చేపట్టిన పనులు పూర్తయ్యాయని ఆ ప్రాంతంలో విద్యుత్ సరఫరా పునరుద్ధరించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామీణ నీటి సరఫరా శాఖ భీమడోలు ఎఇ కె రామారావు పాల్గొన్నారు.



జనరేటర్ పనితీరును పరిశీలిస్తున్న అధికారులు

ఘనంగా అంతర్జాతీయ నర్సుల దినోత్సవం

మండవల్లిలో...

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

రెడ్‌క్రాస్ ఎఎన్ఎం మహిళ శిక్షణ కళాశాలలో శుక్రవారం అంతర్జాతీయ నర్సుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కళాశాల ఛైర్‌పర్సన్ బొమ్మారెడ్డి పద్మజావాణి హాజరై తొలుత ఫ్లోరెన్స్ నైటింగేల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పద్మజా వాణి మాట్లాడుతూ నర్సుల వృత్తికే వన్నెతెచ్చి, వైద్య రంగంలో విశేషమైన సేవలందించిన ఫ్లోరెన్స్ నైటింగేల్ జయంతిని ఆమె గౌరవార్థం ప్రతిఏటా మే 12న అంతర్జాతీయ నర్సుల దినోత్సవం జరుపుకుంటూ, ఈ రంగంలో సేవలు అందించిన నర్సులను సన్మానిస్తామని తెలిపారు. కరోనా విపత్తు సమయంలో ప్రాణాలకు తెగించి నర్సులు అందించిన సేవలు వెలకట్టలేనివన్నారు. ఎఎన్ఎం నర్సింగ్ విద్యార్థినులను ఉద్దేశించి మాట్లాడుతూ శిక్షణ అనంతరం మహనీయులను ఆదర్శంగా తీసుకుని సేవా భావంతో పనిచేయాలని కోరారు. అనంతరం ఎంతోమంది నర్సింగ్ విద్యార్థినులను తీర్చిదిద్దుతున్న కళాశాల ప్రిన్సిపల్ వై.డెబోరా, ట్యూటర్లు జి.జ్ఞానవేణి, సిహెచ్.అనూష, ఎ.ప్రియాంకాలను పద్మజావాణి సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెడ్‌క్రాస్ కార్యదర్శి బి.బెన్నీ, కమిటీ సభ్యురాలు వై.ఉమావాణి, కళాశాల ప్రిన్సిపల్ వై.డెబోరా, జి.జ్ఞానవేణి, సిహెచ్.అనుష, ఎ.ప్రియాంక, ఎ.సూర్యనారాయణ, మహమ్మద్, సుధీర్ పాల్గొన్నారు.

ఏలూరు టౌన్ : ప్రతి నర్సింగ్ ఉద్యోగి నర్సింగ్ వృత్తికే వన్నెతెచ్చిన ఫ్లారెన్స్ నైటింగేల్ జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని రోగులకు మంచి సేవలు అందించాలని అసిస్టెంట్ మలేరియా నివారణ అధికారి జె.గోవిందరావు సూచించారు. స్థానిక ఏలూరు అర్బన్ ఫ్యామిలీ వెల్ఫేర్ సెంటర్ పవర్‌పేటలో వైద్యాధికారి డాక్టర్ ప్రత్యూష ఆధ్వర్యంలో అంతర్జాతీయ నర్సింగ్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ ఫ్లారెన్స్ నైటింగేల్ దయతో, ప్రేమతో రోగులకు సేవలందించారన్నారు. ఇప్పటి ఉద్యోగులు నైటింగేల్ మాదిరిగా సేవలందించి వైద్య శాఖకు మంచి పేరు తేవాలని సూచించారు. అసిస్టెంట్ మలేరియా నివారణ అధికారి గోవిందరావు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం మే 12వ తేదీన నైటింగేల్ జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని వైద్య, ఆరోగ్య శాఖకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాస్, ఎల్‌టి.దినరాజ్, ఎఎన్ఎంలు పాల్గొన్నారు.

మండవల్లి : వైద్యం అందించడంలో నర్సులు పాత్ర ఎంతో ఉందని సర్పంచి మెండ జాన్సీ అన్నారు. ప్రపంచ నర్సుల దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రోగికి వైద్యం అందించడంలో డాక్టర్ల కన్నా నర్సుల పాత్ర ఎంతో ఎక్కువన్నారు. అనారోగ్యంతో వచ్చిన రోగిని ప్రేమతో పలకరించడంలోనూ, వైద్య సేవలను అందించి పూర్తి ఆరోగ్యంతో ఇంటికి పంపించడంలో నర్సులకు సాటి ఎవరూ రారన్నారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం స్టాఫ్ నర్సులు యేసు కుమారి, పి.నగీనలను దుశ్శాలువలతో పూలమాలలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డాక్టర్లు అనిలా, జి.సుమ, సిహెచ్ఓ శ్రీనివాసరావు, ఎఫ్ఎన్ఓ నవీన, మెండ సురేష్‌బాబు పాల్గొన్నారు.

పచ్చిరొట్ట సాగుతో నేలలు సారవంతం

ప్రజాశక్తి - చింతలపూడి

పచ్చిరొట్ట విత్తనాలు వాడితే భూ సారం పెరుగుతుందని ఎడి నాగకుమార్ అన్నారు. మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో వ్యవసాయ సలహా మండలి మండల సమావేశం ఎఒ మీనా కుమారి అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగకుమార్ మాట్లాడుతూ పంటలో వచ్చే తెగుళ్లపై రైతులు అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో వెటర్నరీ, హార్టికల్చర్ డిపార్ట్‌మెంట్ అధికారులు పాల్గొన్నారు.

వంద మందికి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - ముదినేపల్లి

ముదినేపల్లిలోని అంబేద్కర్ కాలనీలో శుక్రవారం ముదినేపల్లి సిహెచ్‌సి ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో వైద్యురాలు శాంతిశ్రీ పాల్గొని రోగులకు సుగర్, బిపి వివిధ వ్యాధులకు సంబంధించి పరీక్షలు చేసి మందులు అందించారు. ఈ శిబిరంలో ఎఎన్ఎంలు బేబి, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

కోర్టు తీర్పుపై హర్షం

ప్రజాశక్తి - కైకలూరు

ప్రజా సమస్యలు ప్రస్తావించకుండా ప్రతి పక్షాల గొంతు నొక్కాలనే దురుద్దేశంతో జగన్ తీసుకొచ్చిన జిఒ 1ని రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం రద్దు చేయడం పట్ల టిడిపి నేతలు హర్షం వ్యక్తం చేశారు. పట్టణంలో కోరుకొల్లు సెంటర్‌లో ఎన్‌టిఆర్ విగ్రహం వద్ద హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు పి.త్రినాథ్‌రాజు, రాష్ట్ర వాణిజ్య విభాగం ప్రధాన కార్యదర్శి పిఙెఎస్.మాల్యాద్రి, పట్టణ అధ్యక్షుడు జానీ, జిల్లా కార్యనిర్వహక కార్యదర్శి పోలవరపు లక్ష్మీరాణి, తలారి రాజేష్, సయ్యద్ బాషీద్, యేసురాజు పాల్గొన్నారు.

దళిత గర్జన సభ వాయిదా

మండవల్లి : ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకొని ఏలూరు ఇండోర్ స్టేడియంలో మాల మహాసేన ఆధ్వర్యంలో నిర్వహించే దళిత గర్జన సభను వాయిదా వేసినట్లు మాల మహాసేన జాతీయ ప్రధాన కార్యదర్శి పళ్లెం ఏడుకొండలు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మే 14న ఏలూరులో దళిత గర్జన సభ నిర్వహించేందుకు మాల మహాసేన నిర్ణయించినట్లు చెప్పారు. ఎండలు అధికంగా ఉండి వడగాల్పులు వేయడంతో మాల మహాసేన జాతీయ అధ్యక్షులు అలగా రవికుమార్ ఆదేశాల మేరకు ఈ సభను వాయిదా వేసినట్లు తెలిపారు.

దోమల నిర్మూలనలో ప్రజల భాగస్వామ్యం అవసరం

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

అన్ని కీటకాల కంటే దోమ చాలా ప్రమాదకరమైందని, దోమల నిర్మూలనలో ప్రజలు భాగస్వామ్యం కావాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ డి.ఆశా సూచించారు. డ్రైడే కార్యక్రమంలో భాగంగా ఏలూరు అర్బన్ హెల్త్ సెంటర్ పవర్‌పేట, పవర్‌పేట సచివాలయం పరిధిలో మేదరవీధి ప్రాంతంలో ప్రజలకు అవగాహన కల్పించారు. దోమకాటు చాలా ప్రమాదకరమని, దోమ కుట్టడం వల్ల డెంగీ, మలేరియా, చికెన్‌గున్యా వంటి ప్రాణాంతక వ్యాధులు సంభవిస్తాయని తెలిపారు. దోమల నిర్మూలన ఆవశ్యకత ఎంతైనా ఉందని, పరిసర పరిశుభ్రత ఆచరించడమే ఉత్తమమని సూచించారు. వారానికి ఒకసారి నీటి నిల్వ ప్రాంతాలను పరిశుభ్రపరుచుకుని ఆరబెట్టుకోవాలన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. జిల్లా మలేరియా నివారణ అధికారి పిఎస్ఎస్.ప్రసాద్ మాట్లాడుతూ ప్రజలు దోమ కాటు నుంచి సంరక్షించుకోవాలని, దోమలు కుట్టకుండా దోమతెరలు వాడాలని సూచించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యుపిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ ప్రత్యూష, అసిస్టెంట్ మలేరియా అధికారి గోవిందరావు, ఎంపిహెచ్ఇఒ రవికుమార్, బసవరాజు హెల్త్ అసిస్టెంట్స్ శ్రీనివాస్, ఎఎన్ఎంలు విమల గౌతమి, రోజా జ్యోతి, ఆశాలు లూదియా, వరలక్ష్మి, ఎస్తేరు, విజయ, అరుణ పాల్గొన్నారు.

ర్యాలీలో డిఎంహెచ్ఒ ఎఎన్ఎంలు, ఆశావర్కర్లు

ఉపాధి హామీ కూలీల సమస్యలు పరిష్కరించాలి



ముసునూరులో కూలీలతో మాట్లాడుతున్న నాయకులు

ప్రజాశక్తి - ముసునూరు

వేసవి కాలంలో పని ప్రదేశంలో ఉపాధి హామీ కూలీలకు కనీస సౌకర్యాలు కల్పించాలని సిపిఎం జిల్లా నాయకులు జి.రాజు కేంద్రప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని ముసునూరు, గోపవరం, కోర్లగుంట గ్రామాల్లోని ఉపాధి హామీ చట్టం కూలీలతో వారు శుక్రవారం మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. జి.రాజు మాట్లాడుతూ ప్రస్తుతం పెరుగుతున్న నిత్యావసర ధరలకు అనుగుణంగా రోజువారి వేతనం రూ.600 ఇవ్వాలని, 200 రోజులు పని కల్పించాలని, ఉపాధి హామీ కూలీలకు కేంద్రప్రభుత్వం ఇన్సూరెన్స్ చేయాలని కోరారు. త్వరలో నూజివీడు డివిజన్ పరిధిలోని అన్ని మండలాల కార్మికుల సమస్యలపై నూజివీడు సబ్ కలెక్టర్‌ని కలిసి వినతపత్రం అందించడానికి కూలీలందరూ కలిసి రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి పిల్లి మురళి ఉన్నారు.

నూజివీడు రూరల్ : ఉపాధి హామీ కూలీలపై రైతు సంఘం బృందం మండలంలోని జంగంగూడెంలో సర్వే నిర్వహించింది. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా అధ్యక్షులు నిమ్మగడ నరసింహ మాట్లాడుతూ ఉపాధి హామీలో సమస్యల పరిష్కారానికి ఐక్యంగా పోరాడాలన్నారు. కూలీలకు కనీస వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. వేసవి దృష్ట్యా అలవెన్సులు, మజ్జిగ, మెడికల్ కిట్లు ఏర్పాటు చేయాలన్నారు. కూలీల పని ప్రదేశాల్లో టెంట్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు

పొదుపుతో ఎన్నో ప్రయోజనాలు

ప్రజాశక్తి - మండవల్లి

విద్యార్థులు విద్యార్థి దశ నుంచే పొదుపు చేయడం అలవాటు చేసుకోవాలని, తద్వారా ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని ఇండియన్ బ్యాంక్ మేనేజర్ బొంతు దుర్గారావు అన్నారు. స్థానిక గ్రంథాలయం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన విబిరంలో భాగంగా శుక్రవారం విద్యార్థులకు నగదు పొదుపుపై ఆయన అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి పొదుపు చేయడం తప్పనిసరిగా అలవాటు చేసుకోవాలన్నారు. పొదుపు చేయడం ద్వారా విద్యార్థులు దుర అలవాట్లకు దూరంగా ఉండే అవకాశం ఉంటుంన్నారు. విద్యార్థులకు ఎటువంటి డిపాజిట్లు లేకుండా ఇండియన్ బ్యాంకులో ఖాతాను తెరుచుకోవచ్చున్నారు. పొదుపుతో పేదరికం పోతుందని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక సభ్యులు ఎల్ఎస్.భాస్కంరావు అన్నారు. అనంతరం పొదుపు డబ్బాలను దర్శించి ఆర్థిక అక్షరాస్యత బ్యాంకింగ్ విధానాలపై అవగాహన కలిగించారు. ఈ కార్యక్రమంలో ఐక్యవేదిక మండల శాఖ అధ్యక్షులు టి.అప్పారావు, గ్రంథాలయ అధికారిని షేక్ పరివేణ, పాఠకులు గంగోనేని శ్రీను, రేపల్లి శివ పాల్గొన్నారు.

మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

మండలంలోని బుట్టాయగూడెం, రెడ్డిగణపవరం సొసైటీల్లో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను పోలవరం ఎంఎల్‌ఎ తెల్లం బాలరాజు శుక్రవారం ప్రారంభించారు. ఆయా గ్రామాల సొసైటీల ఆధ్వర్యంలో మార్క్‌ఫెడ్ ద్వారా మొక్కజొన్నకు క్వింటాల్‌కు క్వింటాల్‌కు రూ.1962 మద్దతు ధరతో కేంద్రాలను ప్రారంభించినట్లు ఎంఎల్‌ఎ బాలరాజు తెలిపారు. కార్యక్రమంలో బుట్టాయగూడెం సొసైటీ అధ్యక్షుడు ఆరేటి సత్యనారాయణ, మండల వ్యవసాయాధికారి సుమలత, గ్రామ సర్పంచి తెల్లం వెంకాయమ్మ, జెడ్‌పిటిసి మొడియం రామ తులసి తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌బికెల ద్వారా మొక్కజొన్న కొనుగోలు

ప్రజాశక్తి - ముసునూరు

రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా కొనుగోలు కేంద్రాల ద్వారా మొక్కజొన్న కొనుగోలు చేయనున్నట్లు వైస్ ఎంపిపి కోటగిరి రాజానాయన చెప్పారు. మండలంలోని లోపూడి రైతు భరోసా కేంద్రం వద్ద మొక్కజొన్న రైతులతో మండల వ్యవసాయ అధికారి సిహెచ్.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో శుక్రవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజానాయనా మాట్లాడుతూ మద్దతు ధర రూ.1962 మొక్కజొన్న కొనుగోలు చేయనున్నట్లు చెప్పారు. పది నుంచి 15 రోజుల్లో రైతుల వ్యక్తిగత ఖాతాల్లో నగదు జమవుతుందని తెలిపారు. మొక్కజొన్న రైతులందరూ రైతు భరోసా కొనుగోలు కేంద్రాల ద్వారా అమ్మకాలు నిర్వహించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి పేరం కృష్ణ, వైసిపి గ్రామ అధ్యక్షులు బి.నరసింహరావు పాల్గొన్నారు.

ఐటిఐలో ప్రవేశానికి దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

పట్టణంలోని ప్రభుత్వ ఐటిఐ కళాశాలలో 2023 - 24 విద్యా సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు కళాశాల ప్రధాన అధికారి దేవరకొండ భూషణం శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. పదో తరగతి ఉతీర్ణులైన, ఫెయిలైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. జూన్ ఆరో తేదీ సాయంత్రం ఐదు గంటలలోపు ఐటిఐ కళాశాల వెబ్ సైట్‌లో రిజిస్టర్ చేసుకోవాలని కోరారు. వివరాలకు కళాశాల కార్యలయంలో సంప్రదించాలని తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్రజాశక్తి - మండవల్లి

విద్యుత్ ఉప కేంద్రాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు శనివారం ఉదయం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నామని ఎలక్ట్రికల్ ఎఇ జి.రామకష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పుట్లచెరువు, పెరికేగూడెం గ్రామాల్లోని విద్యుత్ ఉప కేంద్రాల్లో విద్యుత్ ప్రసారం చేయడంలో సమస్యలు నెలకొన్నాయన్నారు. సమస్యను పరిష్కరించే విధంగా మరమ్మతులు చేయడం కోసం శనివారం ఉదయం 7 గంటల నుంచి 10:30 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలుపుదల చేస్తున్నామన్నారు. మండవల్లి, పెరికేగూడెం, కొర్లపాడు, లింగాల, కానుకొల్లు, పొట్లచెరువు, మోదుగుమూడి, పసలపూడి, సుబ్బారావుపేట గ్రామాలకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నామని తెలిపారు. 10:30 గంటల నుంచి విద్యుత్ సరఫరా ఉంటుందని తెలిపారు. ఈ అసౌకర్యాన్ని గమనించి విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

పేదలకు అన్నదానం

ప్రజాశక్తి - పోలవరం

కొంతకాలం క్రితం మృతి చెందిన తన కుమారుడు మంగిన మహేష్ జ్ఞాపకార్థం మాజీ ఉప సర్పంచి మంగిన కొండ పోలవరం పంచాయతీలో పలుచోట్ల సిమెంట్ బెంచీలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కొండ మాట్లాడుతూ తన కుమారుడి మృతి తనకు తీరని లోటని, అతని జ్ఞాపకార్థం ప్రతి ఏటా అతని వర్థంతి, జయంతుల సందర్భంగా పలుచోట్ల పేదలకు, వృద్ధులకు అన్నదానం, వస్త్ర దానం చేస్తున్నామని, స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. తన కుమారుడి జయంతి సందర్భంగా పంచాయతీలో గ్రామస్తుల కోరిక మేరకు సాయిబాబా ఆలయం వద్ద ఒక సిమెంట్ బెంచి, బెస్తా వీధి రామాలయం వద్ద ఒక సిమెంట్ బెంచి, కమ్మరగూడెంలో రెండు, నూతన గూడెంలో రెండు సిమెంట్ బెంచీలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తన నివాసం వద్ద 50 మంది పేద పిల్లలకు అన్నదానం నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మంగిన పోసిరత్నం, మంగిన రాజు, మేడుం పార్వతి, పృధ్వి పాల్గొన్నారు.

పాస్‌పోర్టు పోయినది

VISWANADHAPALLI KANAKA RAJU అను నాకు విశాఖపట్నం పాస్‌పోర్టు కార్యాలయం అధికారులు ది. 04-02-2020న **U6953439** నెంబరు గల పాస్‌పోర్టు మంజూరు చేసారు. సదరు పాస్‌పోర్టు జిరాక్సు కాపీలు తీయించుకునేందుకు మా ఇంటి నుండి మొగల్తూరు వెళ్తుండగా నా ఒరిజినల్ పాస్‌పోర్టు పోయినది. గాన, నా పాస్‌పోర్టు ఎవరికైనా దొరికిన యెడల ఈక్రింది చిరునామాకు అందించగలరని కోరుతున్నాను.

VISWANADHAPALLI KANAKA RAJU
S/o. Viswanadhapalli Pothuraju
D.No. 7-88, Kothadindla
Pallavapalem, Perupalem Post
Mogaltur Mandal
West Godavari Dist., A.P.,